## మంచి వార్త



# అడ్డుగోడలను బద్దలు కొట్టొచ్చు!

**మహారాష్ట్రలోని** జల్‌గాంకు చెందిన 29 ఏండ్ల రొమీటా బుందేలా మర్చెంట్ నేవీలో మహిళా ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్ (ఈటీవో)గా పనిచేస్తున్నారు. ఈ రంగంలో ఇప్పటి వరకు పురుషులదే ఆధిపత్యం. అందుకే మర్చెంట్ నేవీలో ఈటీవోగా రొమీటా ఎదిగిన క్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. రొమీటా కెరీర్ ప్రయాణం మేర్స్క్ కంపెనీకి చెందిన ఓ కార్గో నౌకలో 2017లో మొదలైంది. ఇరవై ఒక్కమంది బృందంలో రొమీటా ఒక్కరే మహిళ కావడం గమనార్హం. అంతేకాదు మేర్స్క్‌లో ఆమె తొలి మహిళా ఈటీవో కూడా! అలా ఎన్నో సవాళ్లు, అనుమానాలతో ఆమె ఉద్యోగం మొదలైంది. ఈ ఏడేండ్లలో ఆమె తన వృత్తి నైపుణ్యం, అంకితభావంతో తనను విమర్శించిన వాళ్ల నోళ్లు మూయించింది. భారతీయ నౌకాదళంలో ఉద్యోగం తెచ్చుకోవాలన్నది ఆమె చిరకాల స్వప్నం. ఈ దిశగా ఆమె మహారాష్ట్రలోని టొలానీ మేరీటైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్ కోర్సులో చేరారు. ఆ ఇన్‌స్టిట్యూట్‌లో కూడా రొమీటానే తొలి మహిళా ఈటీవో క్యాడెట్. ఇక వృత్తిపరంగా రొమీటా పట్టుదలకు తొలి సవాలు ఆమె ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో సముద్రంలో ఎదురైంది. నెలల కొద్ది సమయం ఇంటికి దూరంగా నీళ్లమీదే ఉండాల్సి వచ్చేది. మరోవైపు కఠినమైన బాధ్యతలు, తన సామర్థ్యంపై సహోద్యోగుల సందేహాలతో ఆమె ఎన్నో సవాళ్లకు ఎదురీదాల్సి వచ్చింది. కానీ వృత్తిపట్ల అంకితభావం రొమీటాకు మరిన్ని ఉన్నత పదవులకు వెళ్లే అవకాశం ఇచ్చింది. అలా మేర్స్క్ కంపెనీలో అతి పిన్నవయస్కురాలైన, తొలి మహిళా ఈటీవో మాత్రమే కాదు... మొదటి ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ కూడా రికార్డు సాధించారు. 2023లో ఆమె 'కార్నివాల్ యూకే' క్రూయిజ్‌లో చేరారు. ఇక వృత్తిలో భాగంగా ఆమె సాంకేతిక బాధ్యతలతోపాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఆటోమేషన్ సిస్టమ్స్ వ్యవహారాలు కూడా పర్యవేక్షిస్తారు. మొత్తంగా చూస్తే మర్చెంట్ నేవీలో రొమీటా ప్రయాణం కెరీర్ అడ్డుగోడలను ఎవరైనా సరే బద్దలు కొట్టొచ్చనడానికి ఓ ఉదాహరణ. రంగం ఏదైనాసరే అత్యున్నత ప్రతిభ కనబర్చడానికి లింగపరమైన తేడాలు అడ్డుకావనడానికి ఓ రుజువు. కాబట్టి... ''మీ ఎదుగుదలకు అడ్డుగా నిలిచే వాళ్ల మాటలు అస్సలే పట్టించుకోవద్దు. మీ సామర్థ్యాల మీద నమ్మకం ఉంచి, లక్ష్యం మీద దృష్టి సారించాలి. ఇతరుల లాగే... ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువగానే మీరు కూడా దేన్నయినా సాధించగలరు'' అంటారు రొమీటా.

## వైతాళికుల వాణి

బరిని విడిచిపెట్టకండి.
తట్టుకొని నిలవండి.
మిగతా జీవితమంతా
విజేతలా బతకేయండి.

• **మహమ్మద్ అలీ**
(ప్రపంచ ప్రసిద్ధ బాక్సర్)

## క్యా సీన్ హై!

